# అప్పులబాధతో రైతు బలవన్మరణం

**కర్నూలు,డిసెంబర్ 2 :**
అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు బస్తిపాడు చంద్రశేఖర్ గౌడ్ (37) తన రెండెకరాల సొంత పొలంతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారు. గత మూడు సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడంతో సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం అధికమైంది. ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు చేశారు. అధిక వర్షాలతో దిగుబడి తగ్గిపోయింది. దక్కిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల భారం మరింతగా పెరిగింది. మొత్తం రూ. పది లక్షల మేర అప్పులు మిగిలాయి. పంటలు దక్కకపోవడం, అప్పులు తీరే దారిలేకపోవడంతో ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

TGTEL/25/A0977

# తొవ్వ

స్వగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

# రేవంత్ మక్తల్ సభ అట్టర్ ఫ్లాప్

**లిఫ్ట్కు రెండుసార్లు శంకుస్థాపన చేస్తారా**

**మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్ 2:** సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాల మొదటి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కొడంగల్, నారాయణ్ పేట లిఫ్ట్‌కు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. మక్తల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరోసారి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. ఒకే ప్రాజెక్టుకు సీఎం రెండు సార్లు శంకు స్థాపన చేస్తారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేదు కనుకే సీఎం సభకు జనాలు రాలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని సీఎం పూర్తి చేయడం లేదు. కమిషన్ల కోసమే కొడంగల్ లిఫ్టు పథకాన్ని ముందుకు తెచ్చారు.. సీఎం, ఆయన సోదరులు కమిషన్ల కక్కుర్తిలో మునిగిపోయారు. కేసీఆర్ ఫార్మా సిటీకి సేకరించిన 14 వేల ఎకరాలను వాడుకుని ఫ్యూచర్ సిటీ అని మభ్యపెడుతున్నారన్నారు. ఎన్నికలప్పుడు ఫార్మా భూములను రైతులకు తిరిగి ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి మాట తప్పారు.

సంపుటి : 1 | సంచిక : 95 | బుధవారం 03-12-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

# ఖమ్మం అభివృద్ధి బాధ్యత నాది

## తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే

- తెలంగాణ ఇచ్చిన మన్మోహన్ పేరుతో ఎర్త్ వర్సిటీ
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సిఎం రేవంత్ శంకుస్థాపన



**కొత్తగూడెం,డిసెంబర్ 2:** ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవే పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్లు ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పదేళ్లలో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మీ ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తుందన్నారు. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపిలు పాల్గొన్నారు.




# ప్రతిష్ఠంభనకు తెర

- ఎస్ఐఆర్‌పై చర్చించేందుకు అధికార ఎన్డీయే అంగీకారం
- 8న వందేమాతరం, 9న ఎన్నికల సంస్కరణలపై చర్చ
- స్పీకర్ నేతృత్వంలో జరిగిన బీఏసీ భేటీలో నిర్ణయం
- ఇక సజావుగా సభలు: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- పార్లమెంటు సమావేశాల రెండో రోజూ గందరగోళం

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికార, విపక్షాల మధ్య సయోధ్య కుదిరింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎసఐఆర్)పై చర్చకు కేంద్రం అంగీకరించడంతో ప్రతిష్టంభనకు తెరపడింది. అయితే.. ఎస్ఐఆర్‌పై ప్రత్యేకంగా కాకుండా మొత్తంగా ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తామని కేంద్రం స్పష్టతనిచ్చింది. ఎస్ఐఆర్‌పై అత్యవసరంగా చర్చించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టడంతో..ఈ సెషన్ తొలిరోజులాగానే మంగళవారం సైతం ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశం జరిగింది. భేటీ ముగిసిన అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు పెట్టారు. ఎన్నికల సంస్కరణలపై డిసెంబరు 9న చర్చించనున్నట్టు ఆయన ఆ పోస్టులో తెలిపారు. "డిసెంబర్ 8వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవంపై.. డిసెంబర్ 9వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చించాలని నిర్ణయించాం" అని వివరించారు. ఎన్నికల సంస్కరణలపై అవసరమైతే రెండో రోజూ చర్చించేందుకు అధికారపక్షం అంగీకరించిందని కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేష్ మీడియాకు తెలిపారు. బీఏసీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండోరోజూ వాయిదాల పర్వం కొనసాగింది. ఎస్ఐఆర్ అంశం ఉభయసభలనూ కుదిపేసింది. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుబడుతూ మంగళవారం సైతం విపక్షాలు ఆందోళనను కొనసాగించాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా.. జార్జియన్ పార్లమెంట్ అధ్యక్షులు షల్వా పాపువాష్విలీ నేతృత్వంలోని జార్జియా పార్లమెంట్ బృందానికి స్వాగతం తెలిపారు. ఇంతలోనే.. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం పట్టుబట్టడంతో కేవలం 16 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభం కాగానే.. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ సహా ఇతర విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందేనని డిమాండ్ చేశారు. విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. రాజ్యసభలోనూ ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టాయి.

# రాహుల్‌కు దేశ భవిష్యత్తుపై విజన్ లేదు

- మోదీకి అతిపెద్ద బలం.. ప్రతిపక్షాల మెడలో కట్టిన భారీ మొద్దు ఆయన నాయకత్వమే
- ఎప్పటికైనా ప్రాంతీయ పార్టీలే బీజేపీకి ప్రత్యామ్నాయం
- శివ నాడార్ ఫౌండేషన్ 'ఇగ్నీషన్' సదస్సులో కేటీఆర్




**హైదరాబాద్, డిసెంబరు 2**
జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంగా పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఒక ఎజెండాను, ఒక మోడల్‌ను దేశానికి అందించలేకపోయిందన్నారు. రాహుల్ గాంధీ, ఆయన నాయకత్వం దేశ ప్రధానికి అతిపెద్ద బలంగా మారిందని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతిపక్షం మెడలో కట్టిన పెద్ద మొద్దు లెక్కన రాహుల్ నాయకత్వం తయారైందన్నారు. ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తులోనూ కొనసాగితే కాంగ్రెస్ నాయకత్వం బీజేపీని ఎదుర్కోవడం కష్టమని, ఆ పని కేవలం ప్రాంతీయ పార్టీలకే సాధ్యమవుతుందన్నారు. చెన్నైలో ఐటీసీ గ్రాండ్ చోళా వేదికగా మంగళవారం శివ నాడార్ ఫౌండేషన్ నిర్వహించిన 'ఇగ్నీషన్' సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ శోమా చౌదరి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో 'రిబూటింగ్ ది రిపబ్లిక్' అనే అంశంపై కేటీఆర్ తన అభిప్రాయాలు పంచుకున్నారు.

# త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

- అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేయండి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు
- వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్,డిసెంబర్ 2 :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదిక వద్ద పనులు చురుకుగా సాగాలని, అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. . మరికొద్ది రోజుల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదికగా జరగనుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా.. తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఈ సమ్మిట్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి డి.శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.



# షాక్‌లకు చెక్...

- విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టాం: సీఎం
- వైసీపీ హయాంలో ధ్వంసం చేశారు
- నాడు పీపీఏల రద్దుతో 9 వేల కోట్ల భారం
- ప్రజలపై భారం పడకుండా చేశాం
- ఫెర్రో అల్లాయ్స్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాలు
- ఆర్టీసీకి త్వరలోనే 1000 ఎలక్ట్రిక్ బస్సులు
- రాష్ట్రంలో 5 వేల విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు
- ఇతర రాష్ట్రాలతో 'స్వాపింగ్' ఒప్పందాలు
- ఇంధన రంగంలో ఒప్పందాలను 60 రోజుల్లో అమలు చేయాలి: సీఎం చంద్రబాబు
- విద్యుత్ శాఖపై సమీక్షలో కీలక నిర్ణయాలు

**అమరావతి, డిసెంబరు 2:** గత వైసీపీ పాలకులు విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందన్నారు. విద్యుత్తును వినియోగించుకోకుండానే ఆయా కంపెనీలకు రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్తు వ్యవస్థలను గాడిలో పెట్టామని తెలిపారు. విద్యుత్తు వ్యవస్థల సమర్థ నిర్వహణ ద్వారా చార్జీలను ఏమాత్రం పెంచకుండా.. రూ.9 వేల కోట్ల భారం ప్రజలపై పడకుండా 'జీరో' చేయగలిగామని సీఎం వివరించారు. సచివాలయంలో మంగళవారం విద్యుత్తు శాఖపై సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- ప్రభుత్వ ఉద్యోగులకు కంప్యూటర్ పరీక్ష తప్పనిసరి
- పరిపాలనలో డిజిటల్ నైపుణ్యాల పెంపుకు ప్రభుత్వ ఆదేశాలు
- టైపిస్టులు, అసిస్టెంట్లు సహా అనేక కేటగిరీలకు కొత్త నియమం
- పరీక్షలో ఉత్తీర్ణత సాధించనివారిపై చర్యల సూచన

హైదరాబాద్, డిసెంబర్ 2
తెలంగాణ ప్రభుత్వం పరిపాలన వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచే దిశగా ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని వేగం, పారదర్శకత, సమర్థత పెంచే లక్ష్యంతో, పలు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరీక్షను తప్పనిసరిగా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నంబర్ 237ను జారీ చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. కార్యాలయాల్లో పత్రాల నిర్వహణ నుంచి డిజిటల్ కమ్యూనికేషన్ వరకు అన్ని దశల్లో కంప్యూటర్ పరిజ్ఞానం కీలకం కావడంతో, ఉద్యోగులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం పలు క్లరికల్ మరియు పరిపాలనా కేటగిరీలలో పని చేసే అధికారులకు కంప్యూటర్ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్%-%కమ్ టైపిస్టులు, యూడీ, ఎల్డీ టైపిస్టులు, సీనియర్ మరియు జూనియర్ స్టెనోగ్రాఫర్లు వంటి విభాగాలకు ఈ నియమం వర్తిస్తుంది. పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు ఆఫీస్ ఆటోమేషన్ యంత్రాల వినియోగ సామర్థ్యం కూడా ఉద్యోగులు ప్రదర్శించాల్సి ఉంటుంది. ఫైళ్ల ప్రాసెసింగ్, డేటా ఎంట్రీ, అధికారిక సంభాషణ వంటి పనులు వేగంగా, తప్పుల్లకుండా పూర్తవ్వడం దీనితో సాధ్యమవుతుందని భావిస్తోన్న ప్రభుత్వం, డిజిటల్ పాలనను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొంది. ప్రభుత్వ వర్గాల అంచనా ప్రకారం, కరుణా నియామకాలు మరియు ఇతర కోణాల ద్వారా ఉద్యోగాల్లో చేరినవారిలో కొందరికి కంప్యూటర్ వినియోగంపై తక్కువ పరిజ్ఞానం ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఉద్యోగులు పనిలో సామర్థ్యం పెంపొందించుకోవడానికి ఈ పరీక్ష మాత్రమే పరిష్కారం అన్న దృక్కోణంతో నిబంధన అమల్లోకి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. కంప్యూటర్ ఆధారిత వ్యవస్థలో లోపాలు, ఆలస్యాలు, మానవ తప్పిదాలు తగ్గించడానికి సాంకేతిక నైపుణ్యాలు కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించని ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం స్పష్టం చేయడం విశేషం. అయితే ఉద్యోగులకు సరైన శిక్షణ, అవసరమైన వనరులు, అవకాశం కల్పించిన తర్వాతే చర్యలు చేపడతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పలు శాఖల్లో డిజిటల్ వ్యవస్థలు, ఆన్‌లైన్ సేవలు అమల్లో పెట్టిన నేపథ్యంలో, ఈ కొత్త నిర్ణయం పరిపాలనా సంస్కరణల లో భాగంగా చూడవచ్చని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సాంకేతికత ఆధారిత పాలన, ప్రజలకు త్వరిత సేవలు, ఫైళ్ల సాఫీ ప్రవాహం వంటి లక్ష్యాల సాధనలో ఈ పరీక్ష కీలక పాత్ర పోషించనుందని భావిస్తున్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు మెరుగుపడటం ద్వారా వ్యవస్థ పనితీరు, సేవల నాణ్యత, పారదర్శకత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## మాజీ ఐఏఎస్ అధికారి ఏ.ఎన్. తివారీ మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

- ప్రజాసేవలో విశిష్ట సేవల గుర్తు
- బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి
- ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన



హైదరాబాద్, డిసెంబర్ 2
ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ కేడర్‌లో విశిష్ట సేవలు అందించిన శ్రీ ఏ.ఎన్. తివారీ మరణంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తివారీ ఒక నిజాయితీ గల, నిబద్ధత కలిగిన ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందారని, ఆయన సేవలు పరిపాలనా వ్యవస్థలో చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తన అధికార జీవితంలో తివారీ పలు ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. భువనగిరి ఉప కలెక్టర్‌గా తన కెరీర్ ప్రారంభించి, అనంతరం వరంగల్ జిల్లాలో కీలక పదవులు చేపట్టారు. అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు కార్యదర్శిగా మరియు భారత ప్రధాన సమాచార కమిషనర్‌గా పనిచేసి పరిపాలనను సమర్థవంతంగా నడిపారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. అధికార వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరికి ఆయన చేసిన కృషి విశేషమని చెప్పారు. శ్రీ తివారీని ఒక మంచి కుటుంబమనిషి, స్ఫూర్తిదాయక ప్రజాసేవకుడిగా వర్ణించిన ముఖ్యమంత్రి, ఆయన మరణం పరిపాలనా రంగానికి పెద్ద నష్టం అని అభిప్రాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి దుఃఖంలో భాగస్వామ్యుల మయ్యామని తెలిపారు. ముఖ్యమంత్రి, దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబం ఈ కష్టకాలాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రార్థించారు.

## తెలంగాణ రాజ్‌భవన్ పేరు మార్పు

# ‘లోక్ భవన్’గా ప్రభుత్వం నోటిఫికేషన్

- వలసవాద భావజాలం తొలగింపు దిశగా పేర్ల మార్పు
- కేంద్ర సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు




హైదరాబాద్, డిసెంబర్ 2
తెలంగాణ ప్రభుత్వం రాజ్‌భవన్ పేరును ‘లోక్ భవన్’గా మార్చేందుకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వ సూచనల అనంతరం తీసుకోబడింది. వలసవాద కాలపు నిర్మాణాలు, పేర్లలో ప్రతిఫలించిన అధికార వాద భావజాలం తొలగించి, ప్రజాస్వామ్య పునాదులను ప్రతిబింబించేలా పేర్లను మార్చాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో, ఈ మార్పు అమల్లోకి వచ్చింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దేశంలోని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు లేఖ రాసి, రాజ్‌భవన్, రాజ్ నివాస్ వంటి పేర్లు ప్రజాస్వామ్య దృక్పథానికి అనుగుణంగా లేవని, అవి వలసవాద వారసత్వంతో ముడిపడి ఉన్నాయని పేర్కొంది. ప్రజల ప్రాముఖ్యత ప్రతిబింబించే శైలిలో ఉన్న పేర్లు అధికార భవనాలకు ఉండాలని సూచించింది. కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఈ మార్పుల్లో ముందంజ వేశాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా రాష్ట్రాలు తమ రాజ్‌భవన్‌ల పేర్లను ‘లోక్ భవన్’ లేదా ‘లోక్ నివాస్’గా మార్చి నోటిఫికేషన్లు జారీ చేశాయి. తెలంగాణ ఈ జాబితాలో తాజాగా చేరింది. పేర్ల మార్పు అనేది సాంప్రదాయిక ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరాన్ని ప్రాముఖ్యతగా గుర్తించిన చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ భవనాల పేర్లు ప్రజల ప్రతినిధిత్వం, స్వాతంత్ర భావజాలం, పాలనా విలువలకు అనుగుణంగా ఉండాలని, ఈ నేపథ్యంలో తీసుకున్న నిర్ణయాన్ని సాంస్కృతిక-పరిపాలనా సంస్కరణగా చూస్తున్నారు. రాజ్‌భవన్‌ని ‘లోక్ భవన్’గా మారు పేరుతో పిలిచే చర్య రూపకల్పన పూర్తయిన అనంతరం, సంబంధిత శాఖల శాసన ప్రక్రియలు, బోర్డులు, పత్రాల్లో మార్పులు చేపట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ మార్పుని త్వరితగతిన అమలు చేస్తుందని, తద్వారా కేంద్ర మార్గదర్శకాల అమలులో తమ భాగస్వామ్యాన్ని చాటుకున్నట్టు పేర్కొంటోంది.

## బవేరియా గ్యాంగ్ లీడర్ మిథున్ హతం

- బవేరియా ముఠా కదలికలపై అలెర్ట్ అయిన పోలీసులు
- ఘర్షణలో విచక్షణారహిత కాల్పులు %-% ఎదురుబలంతో మిథున్ ఔట్
- 20 కేసుల్లో వాంటెడ్, రూ.1.25 లక్షల రివార్డుతో తప్పించుకుంటూ వచ్చిన గ్యాంగ్‌స్టర్‌కు ముగింపు



నోయిడా, డిసెంబర్ 2
ఉత్తరప్రదేశ్‌లోని బిదోలీ అటవీ ప్రాంతం అర్ధరాత్రి యాక్షన్ సీన్లలా మారిపోయింది. దట్టమైన అడవుల్లో దాగి ఉన్న బవేరియా గ్యాంగ్ కదలికలపై సోమవారం సాయంత్రం పక్కా సమాచారం రావడంతో పోలీసులు, స్పెషల్ దర్యాప్తు బృందాలు సమీపంలోని సినీఫక్కీ అటవీ ప్రాంతాన్ని ముట్టడించాయి. అక్రమ కార్యకలాపాలకు సిద్ధమవుతున్న ముఠా సభ్యులు చేసిన పోలీసులు కనబడగానే విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ప్రతీకారంగా పోలీసులు కూడా ఎదురుకాల్పులు ప్రారంభించగా, గ్యాంగ్ లీడర్ మిథున్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. 20 క్రిమినల్ కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న అతడిపై రూ. 1.25 లక్షల రివార్డు కూడా వెలువడింది. బవేరియా ముఠా ప్రధానంగా ఝింఝానా పరిసరాల్లో చోరీలు, దోపిడీలు, హింసాత్మక దాడులతో బెడద సృష్టిస్తోంది. తాజాగా మళ్లీ పెద్ద ఎత్తున నేరాలకు ప్రణాళిక చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్‌కు సమాచారం రావడంతో ప్రత్యేక బృందాలు సజావుగా ఆపరేషన్‌ను అమలు చేశాయి. పోలీసులు దగ్గరపడే ఒదుకు ముందే గ్యాంగ్ సభ్యులు తప్పించుకునే ప్రయత్నంలో నిర్విరామంగా ఫైరింగ్ చేయడంతో ఇన్‌స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్ ఒకరు ప్రమాదకరంగా గాయపడ్డారు. చిక్కుకున్న మిథున్ కాల్పుల్లో ఖతం కాగా, అతడితో పాటు ఉన్న మరో వ్యక్తి అడవిలోకి పారిపోయినట్లు తెలుస్తోంది. గ్యాంగ్ మొత్తం కార్యకలాపాలు, ఆయుధాల సప్లై, దాచిపెట్టిన స్థావరాలపై పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. మిథున్ మృతి బవేరియా ముఠాకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

## పవన్ కల్యాణ్ ‘దిష్టి’ వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శ

- బాధ్యతాయుత పదవిలో ఉండి రాష్ట్రాల మధ్య విభేదాలు రేపడం సరికాదన్న మంత్రి
- “మా రాష్ట్రాన్ని తుపాను ముంచినా ఎవ్వరినీ నిందించలేదు”
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్



హైదరాబాద్, డిసెంబర్ 2
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన “దిష్టి” వ్యాఖ్యలపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. కీలక పదవిలో ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. మంగళవారం హుస్నాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. కొనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి “తెలంగాణ ప్రజల దిష్టి” కారణమని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పొన్నం ప్రభాకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తోంది. కానీ మేమెవరినీ తప్పుపట్టలేదు. ప్రకృతి విపత్తు అనుకుని భరించాం. అయితే డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి అపార్థపూరిత వ్యాఖ్యలు చేయడమేంటి?” అని ప్రశ్నించారు. “కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?” అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాం టివని, రెండు వర్గాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు చెడగొట్టే ప్రయత్నాలు ఎవరు చేసినా సహించబోమని పొన్నం హెచ్చరించారు. ప్రజలను ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు ప్రాంతీయ ద్వేషానికి దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న ప్రభుత్వ ప్రతినిధి ఇలా మాట్లాడటం బాధాకరమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఈరకం విమర్శలు చేయడం అనైతికమని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. “ఇలాంటి వ్యాఖ్యలను సమర్థించి మౌనంగా ఉండటం కూడా బాధ్యతారాహిత్యం. వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలి” అని అన్నారు. అలాగే, పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని విజ్ఞప్తి చేశారు. “ఇలాంటి మాటలు సామాన్యుల మధ్య విషాన్ని పండిస్తాయి. బాధ్యత ఉన్న నాయకులు సామరస్యాన్ని పెంపొందించాలి, కాకపోతే విచ్ఛిన్నం చేయకూడదు” అని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు సున్నితమైన దశలో ఉన్న నేపథ్యంలో, ఈ వివాదంపై అధికార పార్టీలు ఎలా స్పందిస్తాయో చూడాలి.

## నునావత్ వీరమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన ఏఎంసీ చైర్మన్



కేసముద్రం,డిసెంబర్ 2,తొవ్వ
కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామ శివారు భవనిగడ్డ గ్రామం లో మంగళవారం భవాని గడ్డ గ్రామంలోని వృద్ధురాలు నునావత్ వీరమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని కోరుకుంటూ వారి దహన సంస్కారాలకు సహాయం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి,టిపిసిసి సభ్యులు గుగులోత్ దసురు నాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, పాల్వాయి వెంకట రెడ్డి, భవాని గడ్డ తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ధరావత్ శంకర్ నువ్వునావత్ లక్ష్మణ్ కాట్రపల్లి గ్రామం కమిటీ అధ్యక్షులు జల్లే యాకాంబరం పుట్ట ప్రభాకర్, జర్పుల రాజు, బూక్య సురేష్ పాల్గొని పార్థివ దేహానికి శ్రద్ధాం జలి ఘటించి నివాళులు అర్పించారు.

# ఇక హైవేలపై ప్రయాణం మరింత సురక్షితం

**- ఎన్‌హెచ్ఏఐ - రిలయన్స్ జియో కీలక ఒప్పందం - మొబైల్‌కు నేరుగా ప్రమాద హెచ్చరికలు**

**- కొత్త సిస్టమ్ దేశవ్యాప్తంగా అమలు పోవనుంది**

**న్యూఢిల్లీ : డిసెంబర్ 2**
దేశంలోని జాతీయ రహదారులపై ప్రయాణం ఇక మరింత సురక్షితంగా మారనుంది. హైవేల్లో ప్రమాదాలు తగ్గించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అత్యాధునిక మొబైల్ ఆధారిత భద్రతా హెచ్చరిక వ్యవస్థను ప్రవేశపెడుతోంది. ఇందుకోసం రిలయన్స్ జియోతో మహత్తర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ప్రమాద అవకాశాలు ఉన్న ప్రాంతాలు, కఠిన వాతావరణ పరిస్థితులు, రోడ్లపై పశువుల సంచారం, సడన్ డైవర్షన్స్ వంటి కీలక సమాచారాన్ని నేరుగా ప్రయాణికుల మొబైల్‌కు పంపనున్నారు. ఈ సరికొత్త సిస్టమ్ కోసం అదనపు హెచ్చరిక బోర్డులు అవసరం లేకుండా, పూర్తిగా జియో 4జీ, 5జీ నెట్‌వర్క్‌పై ఆధారపడుతుందని అధికారులు తెలిపారు.

ప్రయాణికులకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ అలర్ట్స్, హై ప్రైయారిటీ కాల్స్ రూపంలో ముందస్తు హెచ్చరికలు చేరడం వల్ల డ్రైవర్లు ముందుగానే జాగ్రత్తలు తీసుకునే వీలుంటుంది. ప్రాజెక్ట్ తొలి దశగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో పైలట్ మోడ్‌లో అమలవనుంది.



ట్రయల్స్ తరువాత ఈ సిస్టమ్‌ను జాతీయ రహదారి నెట్‌వర్క్ మొత్తం మీద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ వ్యవస్థను హైవేయాత్ర యాప్, ఎన్‌హెచ్ఏఐ డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్, నేషనల్ హైవే ఎమర్జెన్సీ నంబర్ 1033తో అనుసంధానం చేయనున్నారు. డేటా రక్షణ ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన హెచ్చరికలు అందేలా చర్యలు తీసుకుంటామని హైవేస్ అథారిటీ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇతర టెలికాం సంస్థలను కూడా ఈ వ్యవస్థలో చేర్చి దేశవ్యాప్తంగా అన్ని హైవేలు రియల్ టైమ్ సేఫ్టీ అలర్ట్ ఫెసిలిటీతో పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ఒప్పందం రహదారులపై జర్నీ సేఫ్టీని పెంపొందించే దిశగా ప్రధాన ముందడుగు అంటూ అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణ స్వరాష్ట్ర భావన పాల్వంచ, కొత్తగూడెంలో పుట్టిందే

**- చారిత్రక పారిశ్రామిక కేంద్రంగా విలసిల్లనున్న ప్రాంతం - భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**- మన్మోహన్ సింగ్ పేరుతో తెలంగాణలో కొత్త విద్యా యుగానికి శ్రీకారం**

**- ఖమ్మం జిల్లాలో పరిశోధన, అభివృద్ధికి కొత్త అవకాశం - విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాధాన్యతతో రాష్ట్రాభివృద్ధి లక్ష్యం**



**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 2**
దేశంలోనే మొదటి భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయానికి మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును పెట్టినట్టు ఆయన తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ విద్యాసంస్థను ప్రాముఖ్యంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకటి శ్రీహరి తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సంస్థ స్థాపన ప్రాంతానికి విద్య, పరిశోధన, ఉపాధి పరంగా ఉపయోగపడనుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

**తెలంగాణ ఆత్మకాంక్ష**

**చారిత్రక నేపథ్యం గుర్తుచేసిన సీఎం**

ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆరు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర భావన పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లోనే పుట్టిందని చెప్పారు. ఆ ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అందుకే ఈ విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టినట్టు వివరించారు. దేశాన్ని సంక్షోభం నుంచి సంక్షేమ దిశగా నడిపించిన నేతగా మన్మోహన్ సింగ్ పేరు నిలుస్తుందని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ఆయన స్ఫూర్తి అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చూపిన మార్గదర్శక తత్వంతో విద్య, నీటి పారుదల రంగాలను బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు.

**ఖనిజ సంపద - పరిశోధనకు కేంద్రం**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నట్టు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సింగరేణి వంటి పెద్ద సంస్థలు ఉన్న ప్రాంతంలో ఖనిజ



సంపదపై అధ్యయనం, పరిశోధన, అన్వేషణ చేయడానికి అవసరమైన వేదికగా ఈ విశ్వవిద్యాలయం పనిచేస్తుందని చెప్పారు. బహిష్కృత ప్రాజెక్టులకు నూతన ఊపిరి ఈ ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత ప్రభుత్వమిదేనని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి విద్య, పారుదలే ఆధారంతెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్న దృఢ సంకల్పంతో విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాముఖ్యతనిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. శాస్త్ర సాంకేతికత, పరిశోధన, పరిశ్రమల సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం భూ విజ్ఞాన శాస్త్రం రంగంలో దేశానికి మార్గనిర్దేశక కేంద్రంగా మారాలని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# పవన్ కళ్యాణ్ నరదిష్టి వ్యాఖ్యలు దుర్మార్గం

**పదిరోజులైనా మన మంత్రులకు సోయిలేదు**

**మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్,డిసెంబర్ 2 :**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ 'నర దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రతిపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ మంత్రులు మూకుమ్మడిగా దాడికి దిగారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజుల తర్వాత స్పందించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరని విమర్శించారు. కొందరు వాటర్‌లో నీళ్లు కలుపుకుని స్పృహ కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. మరికొందరు కమిషన్లు పంచుకునే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజులకు స్పందించడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి అన్నారు. ఒక ప్రాంతం, ఒక మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో తామెప్పుడూ ప్రాంతాలను దూషించలేదని తెలిపారు. అన్నదమ్ములుగా విడిపోయి వేర్వేరుగా కలిసి బతుకుదామని కేసీఆర్ ఆనాడే చెప్పారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ నీడలో హైదరాబాద్‌లో ప్రశాంతంగా ఉన్నామని ఏపీ ప్రజలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని హితవుపలికారు. పవన్ కల్యాణ్ సినిమాలను ఆపుతామని ఇక్కడి మంత్రి కామెడీగా మాట్లాడుతున్నారని కోమటిరెడ్డిని ఉద్దేశించి జగదీశ్ రెడ్డి విమర్శించారు.

వాస్తవానికి అభిమానం వేరు.. రాజకీయం వేరు అని చెప్పారు. తమ అభిమాన హీరోగా ఎవరి సినిమాలనైనా ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. పది రోజుల తర్వాత కాంగ్రెస్ మంత్రులు స్పందించిన తీరు ఇద్దరిలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టుందని విమర్శించారు. కండ్ల ముందు కృష్ణా నీళ్లు తీసుకెళ్తుంటే అప్పుడూ అలసత్వమే అని మండిపడ్డారు. నీళ్లు, కమిషన్లపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెడితే మంచిదని సూచించారు. తాజాగా బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కూడా పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడుతూ.. పవన్ రాజకీయ ప్రయాణాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒంటరిగా గెలవలేని వ్యక్తి పవన్ కళ్యాణ్. సొంతగా ఎన్నికల్లో గెలవలేక, కమ్మ, కాపు సామాజిక వర్గాలను ఏకం చేసి సినిమాలో లాగా సమయానికి చంద్రబాబు వచ్చి కాపాడితే గెలిచి ఉప ముఖ్యమంత్రి అయ్యావు. అసలు తెలంగాణ మీద నీకెందుకు అంత ఏడుపు? తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నావా? అంటూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలను అవమానించేలా పవన్ వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని బీఆర్ఎస్ పార్టీ ఖండిస్తుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ వివాదంపై పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## పార్వతమ్మ గూడెం ఏకగ్రీవ సర్పంచ్ ఎదల్ల పూలమ్మను సన్మానించిన మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి



**తొవ్వ స్వాగతం,**
**నెల్లికుదురు, డిసెంబర్ 02**
మండలంలోని పార్వతమ్మ గూడెం గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్వర్గీయ యెదల్లా కొమ్మల్ రెడ్డి సతీమణి, మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి మాతృమూర్తి పూలమ్మను మంగళవారం మండలంలోని పార్వతమ్మ గూడెం లోని ఆమె నివాసంలో కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, మండల నేతలు వేముల శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డిలు ఆమెను మర్యాదపూ ర్వకంగా కలిసి పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ స్వర్గీయ కొమ్మా ల్ రెడ్డి ఆశయ సాధన కోసం విశేషంగా కృషి చేస్తున్న యా దవ రెడ్డి సేవల వల్లే సర్పంచ్ గా ఆయన మాతృమూర్తి ఏకగ్రీవం కావడం జరిగిందన్నారు. ఆమె ఏకగ్రీవం కావడం పట్ల హర్షం ప్రకటిస్తున్నామన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడం వారి వల్లే జరుగు తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికవడానికి సహక రించిన గ్రామస్తు లతో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ధాన్యం సేకరణలో సమస్యలకు చెక్

**పౌరసరఫరాల కార్యాలయంలో కంట్రోల్ రూమ్**

**మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

అమరావతి,డిసెంబర్ 2: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయ పద్ధతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లై భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణ, అందుతున్న ఫిర్యాదులపై అధికారులతో సివిల్ సప్లై భవన్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి 11,93,743 మెట్రిక్ టన్నుల ధాన్యం తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా 1967 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్ సమస్యలు, టోకెన్ రావడంలో ఆలస్యం, మిల్లుల్లో తూకం సమస్యలు, ఎఫ్‌టిఒ పెండింగ్, రవాణా లేదా గోనె సంచుల కొరత వంటి వాటితో పాటు ఏదైనా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు ఆగిపోవడం వంటి సమస్యలన్నింటినీ టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చన్నారు. ఫోన్ చేసే ముందు రైతులు వారి ఆధార్, రిజిస్ట్రేషన్, టోకెన్ నెంబర్లు, గ్రామం పేరు, రైతు సేవా కేంద్రం వివరాలు దగ్గర ఉంచుకోవాలని మంత్రి సూచించారు. కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చొరవ తీసుకుం టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై అధికారులు, మండలాల వారీ రైతులు, రైస్‌మిల్లర్లు రైతు సేవా కేంద్రాల నిర్వాహకులను ఫోన్ ద్వారా సంప్రదించి ధాన్యం కొనుగోలు సమస్యలను తెలుసుకుని వారికి సూచనలు అందిస్తారన్నారు. ఈ సమీక్షలో సివిల్ సప్లై డైరెక్టర్ ఆర్ గోవిందరావు, సివిల్ సప్లై అడ్మిన్ మేనేజరు జి శిరీష, కంట్రోల్ రూమ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు 14 రోజుల రిమాండ్

**అన్నమయ్య, డిసెంబర్ 2:**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటివరకు 33 మందిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా చేర్చిన మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాములను పిటి వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు తంబలపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో నిందితులుగా నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న వీరిద్దరినీ భారీ బందోబస్తు నడుమ తంబలపల్లి కోర్టుకు తీసుకువచ్చారు. నిందితులకు తంబలపల్లి కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకు 29 మందిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు.


కోర్టుకు హాజరు పరిచి బయటకు తీసుకొచ్చిన సందర్భంలో జోగి రమేష్‌ను తంబళ్లల పల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిషార్ అహ్మద్ కలిశారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.



## సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా
# ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టా÷-గ్గం÷ట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.

## బంధం ఉన్నంత వరకే
# కొనసాగుతుంది
### రాజ్‌నిడుమోరు మాజీ భార్య శ్యామాలి



తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వస్తోన్న రూమర్స్‌కు చెక్ పెడుతూ దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు నెటిజన్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతోన్న వేళ.. రాజ్ మాజీ భార్య శ్యామాలి పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎప్పుడూ తన ఆలోచనలను సోషల్ మీడియా వేదికగా పంచుకునే ఆమె తాజాగా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. 'ఈ అనంత విశ్వంలో మనం ఒక మూల ఉన్నాం' అని అర్థం వచ్చేలా ఒక ఇమేజ్ షేర్ చేశారు. రాజ్ – సమంతల వివాహం జరిగిన రోజు సోమవారం కూడా శ్యామాలి పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని ఆమె రాసుకొచ్చారు. అలాగే, మనతో రుణం ఉన్నంత వరకే బంధాలు అన్నీ ఉంటాయి. రుణం తీరిన తర్వాత బంధం శాశ్వతంగా దూరమవుతుందని శ్యామాలి ఐదు రోజుల క్రితం తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.

# హిందీలో అడుగు పెట్టాలంటే ఆర్భాటం తప్పనిసరి
### మళయాల నటుడు దుల్కర్ సల్మాన్



హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ.. ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ప్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే
# తిరస్కరించే దాన్ని
## రసిక దుగల్

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మిర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

https://epaper.thovvanews.in

TGTEL/25/A0977

తొవ్వ స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

జనరల్ న్యూస్

బుధవారం. 03-12-25

# అయ్యప్ప స్వాముల బిక్ష కొరకు విరాళం...

**తొవ్వ స్వాగతం , నర్సింహులపేట, డిసెంబర్. 02:**



నర్సింహులపేట గ్రామ అయ్యప్ప స్వాముల బిక్ష కొరకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కర్ల నాగన్న మంగళవారం రూ.5116లు విరాళాన్ని అయ్యప్ప కమిటీకి సభ్యులకు అందజేశారు. అంతకు ముందు అయ్యప్పల కుటీరంలో కుటుంబ సభ్యులతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప కుటీర సభ్యులు వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. విరాళం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఆలయ గురుస్వాములు మొగలగాని యాదగిరి, కల్లెడ మధు, అనుమాండ్ల వెంకటరెడ్డి, బండి రమేష్, ఎరనాగి రమేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా అయ్యప్ప ఇరుముడి కార్యక్రమ నిర్వహణ.

## -గురుస్వామి గుంజ వీరస్వామి.



**బయ్యారం,తోవ్వ,డిసెంబర్ 2.**

బయ్యారం మండలానికి చెందిన గురుస్వామి గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో మహబూబాబాద్ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి మాలాదారుల ఇరుముడి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.గురు స్వామి గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.శబరిమల యాత్రకు వెళ్లే మాలాదారులకు గురుస్వామి గుంజ వీరస్వామి ఇరుముడి కట్టారు. శబరిమల యాత్రకు వెళ్లే ముందు అయ్యప్ప స్వామి మాలాదారులు ఇరుముడి తల మీద పెట్టుకొని అయ్యప్ప స్వామి నామం పారాయణం చేస్తూ గ్రామోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో గుంజ శివ దంపతులు,ఇతర స్వాములు పాల్గొన్నారు.



# నామినేషన్ కేంద్రాలను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు.



**బయ్యారం,తోవ్వ,డిసెంబర్ 2.:**

మండలంలో గ్రామ పంచాయతీ నామినేషన్ల పర్వాన్ని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మధుకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని నామినేషన్ కేంద్రాలు బయ్యారం ఎంపిడిఓ కార్యాలయం,కొత్తపేట గ్రామ పంచాయతీలలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి,క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న తీరును బ్యాలెట్ బాక్సుల గదులను పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ జరుగుతోందా అని ఎంపిడిఓ దీపికను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న,తాహశీల్దార్ నాగరాజు,ఎంపిఓ చంద్రమోహన్,పంచాయతీ సెక్రటరీ శ్రీధర్,ఆర్ఐ సందీప్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నార

# ఎన్నికల నిర్వహణ అంశాలపై అవగాహన సదస్సు.

## కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



తొవ్వ స్వాగతం ,నర్సంపేట, డిసెంబర్ 02, :

గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం నర్సంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఆర్ ఓ లు, ఏ ఆర్ ఓ లకు ఎన్నికల నిర్వహణ అంశాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద.పాల్గొన్నరు అదనపు కలెక్టర్ సంధ్యారాణి జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి జిల్లా పశు సంవర్ధక అధికారి కృష్ణ, ఆర్డీవో ఉమారాణి, ఆర్ ఓ లు, ఏ ఆర్ ఓ లు. పాల్గొన్నారు


# ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన

## రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మధుకర్ బాబు



**తొవ్వ స్వాగతం , నర్సింహులపేట, డిసెంబర్. 02:**

ఎన్నికల నియమావళిని సమర్ధంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మధుకర్ బాబు అన్నారు. నర్సింహులపేట మండలములోని నామినేషన్ కేంద్రాలను మూడవరోజు మంగళవారం ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు మధుకర్ బాబు పరిశీలించారు. నామ పత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామ పత్రాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి బలపరిచే వ్యక్తిని మాత్రమే లోనికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు.ఇతరులను క్లస్టర్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉంచాలన్నారు.ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న,స్థానిక ఎంపీడీవో రాధిక,తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీఓ కిన్నెర యాకయ్య, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి మరియన్న, లెజన్ తదితరులు ఉన్నారు.




# కాంగ్రెస్ పార్టీలో అమీనాబాద్ టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సింగర బోయిన కుమారస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరిక.

**తొవ్వ చెన్నారావుపేట, డిసెంబర్ 02**



అమీనాబాద్ టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సింగర బోయిన కుమారస్వామి చెన్నారావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ గారి ఆధ్వర్యంలో పార్టీలో చేరడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్ నర్సంపేట్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చిరా అశోక్ మరియు మండల కిషన్ సెల్ అధ్యక్షులు కర్థూరి సంపత్ రెడ్డి గారు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ మెంబర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దలు నాయకులు యూత్ నాయకులు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.

# గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తా,

## సీనియర్ నాయకుల సలహాలతో పనిచేస్తా,

## గ్రామ ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరుతున్న,

## బీసీ బిడ్డను సర్పంచ్ బరిలో ఉన్న ఆశీర్వదించండి,

## టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కందుల సుభద్ర దర్గయ్య

**తొవ్వ స్వాగతం ప్రతినిధి, కురవి నవంబర్ 2:**



ఈనెల 17వ తేదీన జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విద్యాధికురాలు కందుల సుభద్రను సర్పంచ్ అభ్యర్థిగా టిఆర్ఎస్ పార్టీ బలపరిచినట్లు కందుల దర్గయ్య సుభద్ర తెలిపారు. మంగళవారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలో టీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జూరి ఉమ, సారధ్యంలో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు బలపరిచినట్లు ఆమె తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో అధిక మెజార్టీతో గ్రామ ప్రజల ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. గ్రామానికి కావలసిన మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు మాజీ మంత్రివర్యులు డి.ఎస్ రెడ్యా నాయక్, సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి సలహాలు సూచనలతో ఎన్నికల్లో గెలిచి గ్రామ అభివృద్ధికి వారి సలహాలు సూచనలతో ముందుకు వెళ్తానని తెలిపారు. గ్రామ ప్రజలు గ్రామ ఆడబిడ్డను ఆశీర్వదించి సర్పంచి అభ్యర్థిగా గెలిపించాలని కోరుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. నిరుపేదను అయిన నన్ను జనరల్ స్థానంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలబెట్టి నట్లు తెలిపారు. బీసీలపై టిఆర్ఎస్ పార్టీకి అంతులేని అభిమానం ఉండడంతోటే జనరల్ స్థానంలో నన్ను ఎంపిక చేయటం పట్ల పార్టీకి పార్టీలో సీనియర్ నాయకులకు డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డిఎస్ రెడ్యా నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడికి వచ్చిన గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు గ్రామ పార్టీ కార్యకర్తలు సమిష్టి కృషిగా పనిచేసి వార్డు మెంబర్లను సర్పంచ్ ను అధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్లకొండ వీరమల్లు. మాజీ సర్పంచ్ నరసింగ వెంకన్న. కొత్త వెంకన్న. ఉప సర్పంచ బుడేగ లక్ష్మయ్య. నాయకులు సోమనబోయిన లక్ష్మణ్. బుడేగా మధు. బొడ్డుపల్లి ఉపేందర్. వడ్లకొండ జనగ వెంకన్న. మాజీ సర్పంచ్ వడ్లకొండ రాములు. ప్రముఖ లాయర్ కందుల దరగయ్య. కత్రోజు మోహనా చారి. గొల్లమూడి శ్రీనివాస్ చారి. మద్దినాల లింగన్న. వేమిశెట్టి కరుణాకర్. వడ్లకొండ శరత్. అక్కినపల్లి కిషోర్. తదితరులు పాల్గొన్నారు.



TGTEL/25/A0577

తొవ్వ స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

జిల్లా వార్తలు

మంగళవారం ,02-12-25

# పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రీ ఐక్య క్రిస్మస్ వేడుకలు



**తొవ్వ స్వాగతం ,ప్రతినిధి,కేసముద్రం,డిసెంబర్ 2,:**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సిలోయమ్ ప్రార్ధన మందిరం లో కేసముద్రం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రీ ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు క్రిస్మస్ పర్వదిన మాసంలో మండలంలోని పాస్టర్లు క్రైస్తవ సోదరులందరూ కలిసి ఘనంగా ప్రీ ఐక్య క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా పెనూయేల్ బాప్టిస్ట్ చర్చ్ దైవజనులు పి.విక్టర్ బాబు,రాజు పాల్గొని క్రిస్మస్ సందేశం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...చంద్ర మండలానికి వెల్లి వచ్చిన జాన్ ఎర్లిన్ మానవుడు అంతరిక్షానికి వెళ్లి రావడం గొప్ప కాదు అంతరిక్షమును సృష్టించిన దేవుడు ఈ భూమి మీదకి రావడం చాలా గొప్ప విషయమని అన్నారని గుర్తు చేశారు.ఏసుక్రీస్తు దేవుని స్వరూపము కలిగినవాడై దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనక మానవులను తమ పాపములనుండి విడిపించి రక్షించడానికి లోక రక్షకుడిగా కన్య గర్భమున దీనుడుగా ఈ లోకంలో నరావతారిగా పుట్టడమే క్రిస్మస్ అని అన్నారు.ఈ వేడుకలకు విచ్చేసిన బిషప్ మల్లెపాక తిమోతి,బిషప్ పిల్లి కుమారస్వామి,బిషప్ లివింగ్ వాటర్,రెవరెండ్ ఆర్ సామ్యూల్,దుర్గం సుధాకర్, అబ్రహాంలు, పి.విక్టర్ బాబు రాజ్ ఫెలోషిప్ పాస్టర్లు క్రిస్మస్ కేకును కట్ చేసి మండల ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు మునిగె జోసెఫ్ సురేష్,కార్యదర్శి ఖాతా పిలిఫ్,ఉపాధ్యక్షులు వల్లందాస్ సుధాకర్,ట్రెజరర్ జల్లె ఇశ్రాయిల్,జాయింట్ సెక్రెటరీ సామ్యూల్ కిరణ్,పాస్టర్లు మారేపాక రత్నం,అప్పాల పేతురు,ఇఎస్ ప్రభుజీవన్,కెవి రూబెన్ పాల్, శ్రీధర్,కాలేపాక మహేందర్, ఇసంపల్లి పేతురు, మండలంలోని క్రైస్తవ సోదరులు సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.ఈ వేడుకలో పాల్గొన్న భక్తులు క్రిస్మస్ గీతాలు ఆలపించడంతోపాటు,చిన్నారులు నృత్యాలను చేసి యేసుక్రీస్తును ఘనపరచారు.

## ఎల్లయ్య పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళ్లులు అర్పించిన రాణా ప్రతాప్ రెడ్డి.

**తొవ్వ ,ప్రతినిధి ,నర్సంపేట, డిసెంబర్ 02,**
గురిజాల గ్రామ మాజీ సర్పంచ్ గుగులోత్ఎల్లయ్యఅనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఎల్లయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళ్లులు అర్పించి, వారి కుటుంబసభ్యులనుపరామర్శించారు.వారి వెంట అచ్చ దయాకర్,పల్లకొండ శ్రీను,పడిదం హరి కృష్ణ,హర్ష వర్ధన్,శివ,నాగరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.



## చెక్ పోస్ట్ ను సందర్శించిన వరంగల్ సిపి. సన్ ప్రీత్ సింగ్.

**తొవ్వ ,స్వాగతం ,,ఖానాపూర్, డిసెంబర్ 02,**
గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ఖానాపూర్ మండలంలోని వేప చెట్టు తండా చెక్ పోస్ట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియ సజావుగా, శాంతిభద్రతల మధ్య జరిగేందుకు సంబంధించిన ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత పకడ్బందీగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు, ప్రజలు ఎలాంటి ఒత్తిడీలు లేకుండా నామినేషన్ దాఖలు చేసుకోవడంలో చర్యను తీసుకోవాలి అని ఆదేశించారు. ఎలాంటి వివాదాలు, అశాంతి వాతావరణం నెలకొనకుండా పోలీస్ బందోబస్తు పెంచాలని కోరారు. అధికారులతో సమన్వయంగా ఉండి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్, వెస్ట్ జోన్ డిసిపి బి రాజమహేంద్ర నాయక్, నర్సంపేట ఏసిపి పి. రవీందర్ రెడ్డి, దుగ్గొండి సీఐ ఎం సాయి రామన్న, ఖానాపూర్ ఎస్ఐ సిహెచ్ రఘుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజలందరి చూపు బీజేపీ వైపు రాణా ప్రతాప్ రెడ్డి

• యువత రావాలి మార్పు కావాలని బీజేపీ పార్టీలో చేరిక.

**తొవ్వ స్వాగతం ,ప్రతినిధి,నల్లబెల్లి**
నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లె గ్రామా బీజేపీ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి భూమ నరేష్ ఆధ్వర్యంలో గ్రామయువకులు భూమశ్రీకాంత్,భూమసందీప్,చిక్కీడు రాకేష్,చిక్కీడు నగేష్,చిక్కీడు ప్రశాంత్ బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై మన రాష్ట్రం కూడా అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీతోనే సాధ్యమని పార్టీలోచేరుతున్న వారందరికీ ధన్యవాదాలు అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో యువతకే అవకాశం కల్పించి వారిని ప్రజాప్రతినిధులుగా చేసి వారిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్తానని అన్నారు.



# ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ కి సాగంటి చిత్రం ఎంపిక..



**తొవ్వ స్వాగతం , హనంకొండ , డిసెంబర్ 02:**
ఈ నెల 3,4,5 తేదీలలో హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ కేంద్రంగా కళాయజ్ఞ సృష్టికర్త ఏలూరి శేష బ్రహ్మం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2025 (ఆర్ట్ ఎగ్జిబిషన్) లో హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణి, విద్యా కళాశాల అధ్యాపకురాలు, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి కుంచె నుండి ప్రాణం పోసుకున్న చిత్రం ఎంపిక అయింది... “భారత దేశ సంప్రదాయ గృహాలు” అనే ప్రత్యేక అంశం పై రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖ ఆర్టీస్టులు పాల్గొనే ఈ ప్రదర్శన కు తన చిత్రం ఎంపిక కావడం గర్వకారణం అని మంజుల సంతోషాన్ని మీడియా తో పంచుకున్నారు... ప్రస్తుతం కాంక్రీటు గోడల్లో ఉంటున్న సమాజానికి ప్రాచీన సంప్రదాయ రీతుల్లో కట్టిన నివాసాలు ఎలా ఉండేవో తెలియజేసే ఈ ప్రదర్శనకు ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా రానున్నారని అందుబాటులో ఉండి, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరు ఆహ్వానితులే అని మంజుల తెలిపారు



# రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీగా తోట సురేష్

**తొవ్వ, నర్సింహులపేట, డిసెంబర్. 02:**
తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అసోసియేట్ జూయింట్ సెక్రటరీగా మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన తోట సురేష నియామకమయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్,ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ కు అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు.



# భారీ జనసందోహం మధ్య మారేపల్లి నామినేషన్

## కొమ్మాయిగూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి

**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2:**
తనకు ఓటేసి గెలిపిస్తే కొమ్మాయిగూడం ప్రజలకు సేవకుడిగా ఉంటానని గ్రామ సమస్యలు తన సమస్యలుగా భావించి సమస్యలు తీరుస్తానని గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం నాడు భారీ జన సందోహంతో ర్యాలీగా కొమ్మయిగూడెం గ్రామం నుండి బయలుదేరి రామన్నపేట గ్రామపంచాయతీ వద్ద నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలతో కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండి సేవ చేయడానికి తాను ముందుంటానని వారు పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో తమకు అవకాశం ఇచ్చి ఓటు వేసి గెలిపించాలని ఎల్లప్పుడు తాను ప్రజలకు ఓటర్లకు రుణపడి ఉంటానని వారు తెలిపారు. వీరి వెంట కొమ్మాయిగూడం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





TGTEL/25/A0977
తొవ్వ
స్వాగతం
బుధవారం,03-12-2025
జిల్లా వార్తలు

# సర్పంచ్ గా ఆశీర్వదించండి

## బోగారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

### కునూరు సాయికుమార్ గౌడ్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2బీ**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా కునూరు సాయికుమార్ గౌడ్, నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ



గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకు వెళ్తానాని ప్రజల కష్టసుఖాలు వెన్నంటి ఉంటానని ఒక అవకాశం ఇచ్చి చూడండి నా వంతు అభివృద్ధిని చేస్తానని ఈ సందర్భంగా అన్నారు ఈయన వెంట నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా గ్రామ యువత చిన్నలు పెద్దలు భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి బల నిరూపణ నిర్వహించారు.

# వరంగల్ బస్ సర్వీసును పునరుద్ధరించాలి

## మేచారాజు పల్లి లో గ్రామస్తుల రాస్తారోకో

**తొవ్వ, నెల్లికుదురు, డిసెంబర్ 02**



మహబూబాబాద్ నుంచి మేచరాజుపల్లి మీదుగా వరంగల్ కు వెళ్ళు బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని మేచరాజు పల్లి గ్రామస్తులు మంగళవారం గ్రామంలోని రహదారిపైరాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొయ్యేడి వెంకటేశ్వర్లు గౌడ్, ముంజంపల్లి దేవేందర్, నక్క హరీష్ యాదవ్, తిరుపతి రెడ్డి, ముంజంపల్లి మురళి, ఐలయ్య, లు మాట్లాడుతూ మహబూబాబాద్ నుంచి గ్రామం మీదుగా వరంగల్ కు గత 30 సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సు సేవలు అందుతున్నాయని. గత కొద్ది రోజులుగా బస్సు సర్వీసు నిలిపివేయడంతో కాచికల్ ఎర్రబెల్లి గూడె, మేచ రాజు పల్లి , బూరుగుమడ్ల గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఉమ్మడి జిల్లా కేంద్రమైన వరంగల్ కు వ్యాపార వాణిజ్య పనులతోపాటు వైద్య సేవలకు ఆయా గ్రామాల ప్రజలు వెళ్లడం జరుగుతుందని, సర్వీసును నిలిపివేయడంతో వరంగల్ కు వెళ్లడం కోసం అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అంతేకాకుండా బస్సు సర్వీసును ఉదయం, సాయంత్రం వేళల్లో నడిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న బస్సు సర్వీసులు నిలిపివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే స్పందించి బస్సు సర్వీసును పునరుద్దించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనట్లయితే ఆయా గ్రామాల ప్రజలు నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలు గ్రామంలోని యువత, మహిళలు తదితరులు ఉన్నారు.

# . ఆదరించి గెలిపిస్తే... అభివృద్ధి చేసి చూపిస్తా

### కాస్య తండా బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బోడ నరసింహ నాయక్

## 4గురు బారాస వార్డు సభ్యులు ఏకగ్రీవం



**తొవ్వ, నెల్లికుదురు, డిసెంబర్ 02**

కాశ్య తండా లోని ప్రజలు ఆదరించి సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బోడ నరసింహ నాయక్ గ్రామస్తులను అభ్యర్థించారు. మంగళవారం గ్రామంలో వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మహిళలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తెలియజేయడమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రజల కోసం పనిచేసే బిఆర్ఎస్ పార్టీ వెంటే ప్రజలు ఉండాలని కోరారు. ఇప్పటికే బారాస పార్టీ తరపున వార్డు సభ్యులుగా పోటీలో ఉన్న బానోత్ హుసేని, బానోత్ మౌనిక, బానోత్ బాలు, బానోతు నవీన్ ల పై ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరు బరిలో లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నిక అవనున్నారని తెలిపారు. యువత, మహిళలు తనకు అండగా ఉన్నారని బారాస అభ్యర్థిగా అఖండ మెజారిటీతో గెలవబోతున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బారాస గ్రామ శాఖ అధ్యక్షులు మాలోత్ హుస్సేన్, గ్రామస్తులు బాలు కీమా వీరన్న రాంజీ రవీందర్ మౌనిక తదితరులు ఉన్నారు.

# టిడిపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మీర్జా ఫజల్ బేగ్

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వస్వాగతం , ప్రతినిధి :డిసెంబర్ 2**



రామన్నపేట పట్టణ కేంద్రం సర్పంచ్ అభ్యర్థిగా టిడిపి పార్టీకి చెందిన మీర్జా ఫజల్ బేగ్ మంగళవారం నామినేషన్ వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో సర్పంచ్ గా గెలిచి అన్ని రంగాలలో వెనుకబడినటువంటి పట్టణ కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహా, అధికార ప్రతినిధి బత్తుల సత్యం, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట కార్యదర్శి నకిరేకంటి గణేష్, డి. రాములు, ఆకవరపు సాయి, ఎండి అంజర్, సోహెల్ , రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ స్వాగతం ప్రతినిధి డిసెంబర్ 2బీ**



మనిమద్దే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు ఆఫీసర్ కొండూరు సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో 1984లో యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి విడుదలైన విషపూరిత వాయువు వేలాదిమంది ప్రాణాలను బలికొందని, పెరుగుతున్న కాలుష్యం వల్ల కలిగే సమస్యలపై విద్యార్థిలకి అవగాహన కల్పించారు. చెత్త వ్యర్ధాలు అమ్మోనియం ఫ్లోరైడ్ క్లోరిన్ లాంటి వాయువులు గాలి కాలుష్యానికి కారణం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఓట్లు వేసేందుకు కాదు....

### ఓట్లు వేయించుకోవడానికి బారులు తీరిన వారు....

**తొవ్వ, నర్సింహులపేట, డిసెంబర్. 02**



ఫోటోలో వరుసలో నిలుచున్న వారంతా.. ఓట్లు వేసేందుకు కాదు... ఎన్నికల్లో పోటీకి నామినేషన్లు వేసేందుకు వేచి చూస్తూ ఓట్లు వేయించుకోవడానికి సిద్ధంగా వున్నారు.పంచాయతీల రెండవ విడత ఎన్నికల నినేషన్లు చివరి రోజు కావడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో రాత్రి వరకు బారులు తీరారు. నామినేషన్లు వేసేందుకు ఆశావాహులు పంచాయతీ కార్యాలయం వద్ద భారీగా తరలి రావడంతో అధికారులు ప్రత్యేక టోకెన్ లు ఇచ్చారు. దీంతో నిర్ణీత సమయం ముగిసినా టోకెన్ వున్న వారి నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. స్థానిక ఎస్ఐ మాలోత్ సురేష్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

Published and printed by; MUKESH VEERANTI.TGTEL/ 25/A0977.Cell no ;9398236146.7075529993. gmail.Thovvanews@gmail.com
Head office:THOVVA NEWS. #5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI.
FIRZADHIGUDA,MEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

https://epaper.thovvanews.in

TGTEL/25/A0977

తొవ్వ స్వాగతం

బుధవారం,03-12-2025

# ప్రభుత్వ హాస్పిటల్ కార్మికులకు 26 వేల కనీస వేతనంతో కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్




యాదాద్రి జిల్లాబీ భువనగిరి: తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2

భువనగిరి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ లో కాలం చెల్లిన పాత ఏజెన్సీల టెండర్లను రద్దుచేసి సానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందే విధంగా నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం రోజున నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి కార్మికుల వేతనాలు పెంచాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా హాస్పిటల్ లో ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ పాండు నాయక్ గారికి కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది . ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీస్ మేనేజ్మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) ద్వారా పారిశుద్ధ్యం, భద్రత, రోగి సంరక్షణ నిర్వహణ కోసం మూడు సంవత్సరాల కాల వ్యవధితో రాష్ట్రవ్యాప్తంగా టెండర్ నోటిఫికేషన్ తో ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం కొనసాగుతుందని ప్రస్తుతం కొనసాగుతున్న ఏజెన్సీలు 2022లో ఎంపిక చేశారని వాటి కాల పరిమితి ముగిసి నెలలు గడుస్తున్న కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించలేదని, గత ప్రభుత్వం అప్పటి టెండర్ ముసాయిదలో కార్మికులకు నష్టదాయకమైన అంశాలను జోడించడం చేత ఏజెన్సీ కాంట్రాక్టర్లకు దోచుకుని వెసులుబాటు కలిగిందని అన్నారు. కనుక టెండర్ గైడ్లైన్స్ లో కార్మికులకు కనీస వేతనం 26,000 అందే విధంగా పండగ, జాతీయ, సెలవులు పొందుపరుస్తూ న్యూ టెండర్ పాలసీని విడుదల చేయాలని ఇమ్రాన్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు గుండు వాణి, నీలం నరసింహ సోమ నరసయ్య బట్టుపల్లి లావణ్య శారద లలిత సులోచన భారతమ్మ హేమలత విజయలక్ష్మి సురేఖ శేఖర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# వరిపల్లి యాకయ్య అకాల మృతి

**తొవ్వ,నెల్లికుదురు, డిసెంబర్ 02**



మండల కేంద్రానికి చెందిన వరిపల్లి యాకయ్య(53)అకాల మరణంతో వరిపల్లి కుటుంబంలో విషాదం అలుముకుంది. ఇటీవలేనే యాకయ్య సతీమణి యాకమ్మ గుండె పోటుతో మృతి చెందగా అ సంఘటన నుండి వారు తేరుకొకముందే యాకయ్య మరణంతో అ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.కాగా వరిపల్లి కుటుంబ సభ్యులు పడేమోసి అంతక్రియలో భాగస్వాములు అయ్యారు.యాకయ్య కు కుమారుడు మురళి,కూతురు వసుమతి లు ఉన్నారు. కుటుంబంలో ఇరువురు గుండెపోటుతో నే మృతి చెందడంప్ తో బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈకార్యక్రమంలో వరిపల్లి మల్లయ్య,లక్ష్మయ్య,శ్రీను, ఉప్పలయ్య,డాక్టర్ నరేష్, వెంకటేష్,పూర్ణచందర్,లింగయ్య,కొలిపాక యాకయ్య తోపాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు

# గ్రామాబివృద్ధే తన లక్ష్యం

### ఇస్కిల్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పైల్ల చందన వెంకటరెడ్డి

**యాదాద్రి జిల్లాబీరామన్నపేట: తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2**





గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతుతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇస్కిల్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిని పైల్ల చందన వెంకటరెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# రామన్నపేట సర్పంచ్ అభ్యర్థిగా నకరికంటి నరేష్ నామినేషన్

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2**



బహుజన సమాజ్ పార్టీ నుంచి రామన్నపేట గ్రామం నికి సర్పంచ్ అభ్యర్థిని బలపరిచిన నకిరేకల్ నియోజకవర్గ అసెంబ్లీ ప్రెసిడెంట్ గూని రాజు అభ్యర్థి నకరికంటే నరేష్ సర్పంచిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట గ్రామాభివృద్ధికి తోడ్పడుతానాని, గ్రామంలోని మౌలిక సదుపాయాలకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గా ఆశీర్వదించండి రామన్నపేట అభివృద్ధిని చేస్తా

### మిరియాల మల్లేష్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి

యాదాద్రి జిల్లాబీరామన్నపేటబీ తొవ్వ ప్రతినిధి: డిసెంబర్ 2



రామన్నపేట గ్రామ పంచాయతీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన మిర్యాల మల్లేష్ ని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రకటించారుఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి, ఆయన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అభినందనలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నాయకులు సమిష్టిగా పనిచేసి సర్పంచ్ అభ్యర్థి మిర్యాల మల్లేష్ తో పాటు పార్టీ వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలిపినారు.

# కవులకు కళాకారులకు నిలయం

## ఓరుగల్లు,

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవి..

### మూడవ ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన

### ::డిపిఆర్ఓ పసునూరి రాజేంద్రప్రసాద్.




తొవ్వ స్వాగతం , మహబూబాబాద్ , డిసెంబర్ 02:

కవులకు,కళాకారులకు ఉమ్మడి వరంగల్ జిల్లా నిలయం అని అన్నారు జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా పౌరసంబంధాల కార్యాలయంలో ప్రపంచ మూడవ తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.జనవరి 2026, మూడో తేదీ నుండి 5వ తేదీ వరకు గుంటూరు జిల్లా అమరావతి కేంద్రంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నట్లు ఈ సభలకు మహబూబాబాద్ జిల్లా నుండి సుమారు 150 మంది కవులు కళాకారులు వెళ్లడం గొప్ప విషయం అని తెలిపారు.క్షేత్రస్థాయిలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయడం కళాకారులను కవులను ఆదరించడం చాలా గొప్ప విషయమని మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ నలుమూలల చాటి చెప్పే ప్రతి ఒక్క కళాకారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా రచయితల వేదిక అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణ, బాణాల వీరయ్య, నాల్లం శ్రీనివాస్, దైద ఉషారాణి, ఆరింపుల అనురాధ, మిట్టగడుపుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ప్రకటించిన ఎమ్మెల్యే మురళి నాయక్



తొవ్వ స్వాగతం కేసముద్రం,డిసెంబర్ 2, :కేసముద్రం మండల కేంద్రానికి చెందిన వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు బానోత్ వీరన్న బిచ్య నాయక్ తండ ఎస్టి, క్యాంపు తండ సపావట్ జామ ఎస్టి, మర్రి తండ వాంకుడోత్ తేజ ఎస్ టి, సప్పిడి గుట్ట తండా భానోత్ బద్రు, ఎస్టి, సర్వాపురం తండా బానోత్ దేవూజి ఎస్టి, మహమూద్ పట్నం కట్ల ఎల్లయ్య ఎస్టి, భూక్యారం తండా జాటోత్ సోమి ఎస్టి, ధర్మారం తండా భూక్య ఈశ్వరమ్మ ఎస్టి,పీక్లా తండా గుగులోత్ ఝాన్సీ ఎస్టీ,తౌరియా తండా భూక్య ఉమా ఎస్టీ, బెరువాడ గుగులోత్ బద్రి ఎస్టి, తాళ్ల పూస పల్లి కండే నాగన్న ఎస్సీ, వెంకటగిరి భూక్య సుగుణమ్మ ఎస్టి, అన్నారం బండి పృధ్వి బిసి, అర్పణ పల్లి చీర వెంకటమ్మ బీసీ,భవాని గడ్డ తండా నునావత్ లక్ష్మణ్ జనరల్,బోడ మంచ్యా తండ బోడ మంగ్య జనరల్,గాంధీనగర్ భుక్యా రామ్ చందర్, కాట్రపల్లి పాల్వాయి వెంకట్రెడ్డి జనరల్, కోరుకొండ పల్లి యాసాడి బాలాజీ రెడ్డి, రంగాపురం గొల్లపల్లి రాజేశ్వరి జనరల్, ఉప్పరపల్లి బండారి గోపమ్మ జనరల్ లను ప్రకటించారు మహబూబాబాద్ శాసన సభ్యులు డా"భూక్యా మురళి నాయక్.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర రావు,డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి,జిల్లా నాయకులు బండారు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.